RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 1 | సంచిక: 3 | 21-6-2025 శనివారం | ఎడిటర్ :మర్రి పవీణ్ | పేజీలు : 8 | వెల 4 /-



## యోగాంధ్రకు సర్వం సిద్ధం 22 రికార్డ్ ల కోసం మెగా ఈవెంట్

- ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ
- ఆర్కే బీచ్ లో 3 లక్షల మందికి పైగా యోగాసనాలు
- 25 వేల మంది ఏకకాలంలో సూర్య నమస్కారాలు
- ఎపి వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగాసనాలు

విశాఖపట్నం,(టుడే విదుర) : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. రేపు న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో ఘనంగా వేడుకలను జరపనున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ఈవెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననుండడంతో దేశ వ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

విశాఖ వేదికగా భారీ ప్రణాళికలు..

విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు మొత్తం 127 కంపార్ట్‌మెంట్లలో యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు అధికారులు భారీ ప్రణాళికలు రూపొందించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్ 200ఐ14 మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటవుతుంది. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో వెయ్యిమంది చొప్పున పాల్గొననున్నారు. ప్రతి సెక్షన్‌కు ఒక ఇన్‌చార్జ్, వైద్య సిబ్బంది, పదిమంది వాలంటీర్లు ఉంటారు. ఎల్‌ఈడీ స్క్రీన్లు, మైకులు, చిన్న స్టేజీలు, సౌండ్ సిస్టమ్‌లతో పూర్తిస్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యోగా సంఘాల సభ్యులు, నేవీ, కోస్టల్ గార్డు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, కార్మికులు తదితరులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

22 రికార్డులు లక్ష్యం..

అంతే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. యోగాంధ్ర సందర్భంగా మొత్తం 22 రికార్డులను సాధించే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో 20 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 2 గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించినవి ఉన్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025లో భాగంగా మరో గిన్నిస్ రికార్డు కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. విశాఖలో 26,395 మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సూర్య నమస్కార కార్యక్రమం ఉండబోతుంది. రేపు వాతావరణం అనుకూలించక వర్షం పడితే.. ఆర్కే బీచ్ రోడ్డులో కార్యక్రమాలు రద్దు చేసి మొత్తం కార్యక్రమం ఇదే వేదిక వద్ద నిర్వహించే అవకాశం ఉంది.వాతావరణం అనుకూలంగా ఉంటే ఆర్కే బీచ్ రోడ్డులో గిన్నిస్ రికార్డు పూర్తయిన తర్వాత ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు ఏయుకు వచ్చి విద్యార్థుల సూర్య నమస్కారాలను పది నిమిషాల పాటు పరిశీలిస్తారు. ఏజెన్సీ నుండి గిరిజన విద్యార్థులను 106 పాఠశాలల నుంచి 495 బస్సుల్లో విశాఖకు తీసుకువస్తున్నారు. ముందుగా 25 వేల మంది గిరిజన విద్యార్థులతో 1.08 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేయించనున్నారు. .యోగ దినోత్సవం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సూర్య నమస్కార కార్యక్రమం నిలవనుంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐదు లక్షల మందితో యోగా డే ఉత్సవాలతో గిన్నిస్ రికార్డును ఏపీ ప్రభుత్వం సాధించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందికి పైగా ఒకేసారి యోగా చేయడం, ఒకే ప్రదేశంలో 3 లక్షల మందితో యోగా చేయడం వంటి రికార్డులపై దృష్టి సారించారు.

## విశాఖలో గవర్నర్‌ను కలిసిన మంత్రి నారా లోకేశ్



(టుడే విదుర): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుక్రవారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, మంగళగిరి శాలువాతో సత్కరించిన మంత్రి లోకేశ్, తమ పార్టీ నిర్వహించిన యువగళం పాదయాత్ర లో తన అనుభవాల ఆధారంగా రూపొందించిన పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మైత్రి వాతావరణంలో కొన్ని పౌర, అభివృద్ధి అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా విశాఖలో జరుగనున్న 'యోగాంధ్ర' కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ గవర్నర్‌కు వివరించినట్లు తెలుస్తోంది.ప్రాధాన్యం కలిగింది

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న విశాఖపట్నంలో భారీ స్థాయిలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో దాదాపు 5 లక్షల మంది ప్రజలు పాల్గొననున్నారు. ప్రపంచ రికార్డు స్థాయిలో ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.

## వేదికపై కంటతడి పెట్టిన ద్రౌపది ముర్మ



డెహ్రాడూన్,(టుడే విదుర): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మ వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్మ భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది.ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. 'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట" అని అన్నారు.పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్ఐఈపీవీడీని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్), ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశాఖకు మరో ఐటి దిగ్గజం

## రూ.1582 కోట్లతో కాగ్నిజెంట్ క్యాంపస్




అమరావతి,(టుడే విదుర) : ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్ సొల్యూషన్స్, విశాఖపట్నంలో తమ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. విశాఖపట్నంలో ఐ టీ కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశ్యంతో కాగ్నిజెంట్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తో కంపెనీ ప్రతినిధులు సమావేశమై తమ ప్రణాళికలను వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.1,582 కోట్ల రూపాయల భారీ పెట్టుబడి పెట్టేందుకు కాగ్నిజెంట్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా దాదాపు ఎనిమిది వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.కాగ్నిజెంట్ సంస్థ, తమ క్యాంపస్ ఏర్పాటు కోసం విశాఖపట్నంలోని కాపులుప్పాడ ప్రాంతంలో 21.31 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా, ఈ భూమిని ఎకరా కేవలం 99 పైసల నామమాత్రపు ధరకే కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ఐటీ క్యాంపస్‌ను నిర్మించి, కార్యకలాపాలు సాగించడానికి సిద్ధంగా ఉన్నామని కాగ్నిజెంట్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ కు తెలియజేశారు.ఈ పెట్టుబడి ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, విశాఖపట్నం ఐటీ రంగంలో మరింత అభివృద్ధి సాధించడమే కాకుండా, స్థానికంగా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేసి, ప్రాజెక్టు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఏపీకి కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు.. రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు కేంద్రం నుంచి మరోసారి తీపికబురు అందింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డుమార్గ రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) 750 ఎలక్ట్రిక్ బస్సులను పొందనుంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.కేంద్రం మొదటి దశలో 750 బస్సులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్ కూడా ఎంపికయ్యారు. నగరాల్లో 12 మీటర్లు, 9 మీటర్లు పొడవు ఉన్న రెండు రకాల ఏసీ సిటీ బస్సులు తిరిగేలా ప్లాన్ చేశారు. మొదటి దశలో 750 బస్సుల్లో 9 మీటర్ల పొడవున్న ఏసీ బస్సులు 129 ఉంటే వీటికి కిలోమీటరుకు రూ.62.17 చొప్పున అద్దె చెల్లిస్తారు. అలాగే 12 మీటర్ల పొడవున్న ఏసీ బస్సులు 621 ఉంటే వీటికి కిలోమీటరుకు రూ.72.55 చెల్లిస్తారు. 11 నగరాల్లోని 12 డిపోల వద్ద ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సిద్ధమైంది.

# అంగన్వాడీల్లో జూలై 1 నుంచి ఫేస్ రికగ్నిషన్

## ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం



అమరావతి, **(టుడే విదుర):** జూలై 1వ తేదీ నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీకి లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పోషణ ట్రాకర్‌లో ఫేస్ రికగ్నిషన్ ఆధారిత సేవల అమలుకు కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ నెల 30 నుంచి లబ్ధిదారుల ప్రొఫైల్‌లో ఫేస్ అథెంటికేషన్ ఫీచర్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. దీంతో ఇకపై పౌష్టికాహారం(టీహెచ్ఆర్) పంపిణీ సమయంలో ఎఫ్ఆర్ఎస్ (ఫోటో క్యాప్చరింగ్, ఈ-కేవైసీ) తప్పనిసరికానుంది. ఈమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు కేంద్ర మహిళా,శిశు సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది.

# మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోళ్లు



బాపట్ల, పర్చూరు, **(టుడే విదుర):** గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల ప్రభుత్వం ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అయినప్పటికీ బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడానికి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించాం' అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బాపట్ల జిల్లా పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక వైజంక్షన్ నుంచి ప్రధాన కూడలి వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి మంత్రి ట్రాక్టర్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేశారు. నల్లబర్లీ రైతులతో మాట్లాడారు. హెచ్‌డీఆర్, హెచ్‌డీఎం రకం పొగాకు క్వింటా రూ. 12వేలు, హెచ్‌డీఎక్స్ రకం క్వింటా రూ. 6వేల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కేంద్రం వాటా ఎప్పుడు జమ చేస్తే అప్పుడే రాష్ట్రం వాటా విడుదల చేసి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామన్నారు. కాగా, దుర్మార్గులకు సంతాపాలు తెలిపే పేరిట రోడ్డుమీద పడి శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలని వైసీపీ కుట్ర చేస్తోందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నియామకాలకు దరఖాస్తుల గడువు పెంపు

राष्ट्रीय बाल अधिकार संरक्षण आयोग
भविष्यो रक्षति रक्षितः
NCPCR
National Commission for Protection of Child Rights

అమరావతి, **(టుడే విదుర):** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించినట్టు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 5న జారీ చేసిన నోటిఫికేషన్‌లో విద్యార్హతలను పోస్టు గ్రాడ్యుయేషన్‌గా సూచించామని, దానిని గ్రాడ్యుయేషన్‌కు సడలిస్తున్నామని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

# తగ్గిన వర్షాలు రాష్ట్రంలో లోటు వర్షపాతం

## 26 తర్వాత రుతుపవనాల్లో కదలిక.. 27న అల్పపీడనం: నిపుణులు



విశాఖపట్నం, **(టుడే విదుర):** రాష్ట్రంలో గడచిన వారం, పది రోజుల నుంచి వర్షాలు తగ్గాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినప్పటికీ తర్వాత మందగించాయి. నాలుగు రోజుల క్రితం మరోసారి చురుగ్గా మారి తూర్పు భారతం వైపు పయనించినా రాష్ట్రంలో పెద్దగా వర్షాలు కురవలేదు. రుతుపవనాల్లో మందగమనం కొనసాగుతోందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. జంగమహేశ్వరపురంలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఎండ తీవ్రత ఉంటుందని, అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల ఒకటో తేదీ నుంచి వరకు రాష్ట్రంలో 48.7 మి.మీ.కుగాను 34.4 మి.మీ. వర్షపాతం(సాధారణం కంటే 29 శాతం తక్కువ) నమోదైంది. ప్రస్తుతం జార?ండ్ పరిసరాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం ఒకటి, రెండు రోజుల్లో బలహీనపడుతుందని, ఆ తరువాత ఈనెల 26వ తేదీకల్లా బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించే అవకాశం ఉందని, దీని ప్రభావంతో 27వ తేదీకల్లా అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేశారు. దీంతో రుతుపవనాలు మరోసారి చురుగ్గా మారే క్రమంలో రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉందని వివరించారు.

# మా ఆఫీసులపై దాడి చేసినవారి మీద పోలీసులు కేసులు పెట్టడం లేదు




**(టుడే విదుర):** హైకోర్టును ఆశ్రయించిన జగతి పబ్లికేషన్స్ డైరెక్టర్.. పిటిషన్‌కు విచారణార్హత లేదన్న ఏజీ సాక్షి కార్యాలయాలపై దాడి ఘటనలో తాము ఫిర్యాదులు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ బి.రాణిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే మేజిస్ట్రేట్ వద్ద ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసుకోవాలని.. హైకోర్టులో పిటిషన్ వేయడానికి వీల్లేదన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ తమ కార్యాలయాలపై దాడులను నిరోధించడంలో అధికారులు విఫలమయ్యారని, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించారు. విచారణను జూలై 22కి వాయిదా వేశారు

# నగల కోసం ఘోరం

## తెనాలిలో దుండగుల చేతిలో బలైన వియ్యపురాళ్లు ముగ్గురు మహిళల దారుణ హత



తెనాలి/పిచ్చాటూరు, **(టుడే విదుర):** ముగ్గురు మహిళలను దారుణంగా హతమార్చి, వారి ఒంటిపై ఉన్న బంగారు నగలు దోచుకుపోయారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు వియ్యపురాళ్లు దుండగుల ఘోరానికి బలికాగా, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో ఒంటరి మహిళ హత్యకు గురైంది. వివరాలు... తెనాలి చినవరిమి డొంకరోడ్డులోని రావి రవీంద్రనాథ్ కాలనీలో వియ్యపు రాళ్లు దాసరి రాజేశ్వరి(65), పెట్ట అంజమ్మ (70) కలిసి ఉంటున్నారు. ఓ ఆటోలో మహిళ, ఇద్దరు యువకులు వారింటికి వచ్చారు. వియ్యపురాళ్లను హతమార్చి వారి ఒంటిపై ఉన్న బంగారం దోచుకువెళ్లారు. వృద్ధులైన తమవారి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు రాజేశ్వరి కుమార్తె, అల్లుడు ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం వీడియోలు రికార్డు కాకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు వచ్చి పరిశీలించగా వియ్యపురాళ్లు దారుణహత్యకు గురై రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఐదు కిలోల తూకం రాయితో ఒకరి తలపైన, కర్రతో మరొకరిపై దాడి చేసి హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ఆధారం గా నిందితుల్లో ఒకరు ప్రైవేట్ జీవిత బీమా కంపెనీలో పని చేసే మహిళగా గుర్తించారు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు అరుంధతివాడకు చెందిన కల్పన(40) అనే మహిళ భర్త చనిపోవడంతో కొడుకుతో కలిసి చెన్నైలో క్యాటరింగ్ పనులు చేస్తున్నారు. వారం క్రితమే గ్రామానికి వచ్చారు. రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రపోయిన కల్పన తెల్లవారేసరికి రక్తమడుగులో పడి ఉన్నారు. ఆమె గొంతు కోసిన దుండగులు చెవులు కూడా కోసివేశారు. తల్లిని చంపడంతోపాటు నగలు, నగదు కూడా తీసుకుపోయారని మృతురాలి కుమారుడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# పిల్లలకు ప్రమోషన

## చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్తున్న అంగనవాడీలు




కూడేరు,**(టుడే విదుర):** మండలంలోని ఇప్పేరు గ్రామం అంగనవాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించారు. ఆ చిన్నారులను అంగనవాడీలు పాఠశాలకు తీసుకొని వెళ్లగా.. అక్కడ ఉపాధ్యాయులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీలు పారిజాత, నిర్మల, చింతలమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

# ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో ఫర్నీచర్ ధ్వంసం

## నలుగురు యువకులు హల్‌చల్

## మహిళలను భయభ్రాంతులకు గురిచేసిన వైనం

ఒంగోలు(**టుడే విదుర**) : ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లోకి నలుగురు యువకులు అ క్రమంగా చొరబడి తలుపులు పగులకొట్టి ఫర్నీ చర్‌ను ధ్వంసం చేశారు. అంతేగాకుండా ఆ ఇంట్లోని మహిళలపై దాడికి దిగారు. ఈ సంఘటన ఒంగోలు నగరం ఎన్‌జీవోకాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఏఆర్ కానిస్టేబు ల్‌గా పనిచేస్తున్న గోవింద చౌదరి ఇంట్లో ఆ యన భార్య, పిల్లలతో పాటు బంధువులు ఉ న్నారు. ఇంట్లో అందరూ మహిళలే ఉండగా గోవిందచౌదరి విధులకు వెళ్ళారు. ఈక్రమం లో వేకువజామున 2.30 గంటల సమయంలో ఒంగోలుకు చెందిన గోపి, మరో నలుగురు యువకులు వచ్చి గోవిందచౌదరి ఇంటి సీసీకెమెరాలను ధ్వంసం చేశారు. ఇంటి తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లి మహిళ లను భయభ్రాంతులకు గురి చేశారు. ఫర్నీచ ర్‌ను ధ్వంసం చేశారు. దీంతో మహిళలు ఒక్క సారిగా పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో దుండగులు అక్కడ నుంచి పరారీ అయ్యారు. ఈమేరకు తాలుకా పోలీసు లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీకి 1,400 కొత్త బస్సులు



విశాఖపట్నం,(**టుడే విదుర**): ఏపీఎసఆర్టీసీకి 1,400 కొత్త బస్సులు సమకూర్చామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. విశాఖలోని ద్వారకా బస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలను అందించేందుకు అధిక సంఖ్యలో బస్సులను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. విశాఖకు కేటాయించిన 100 ఎలక్ట్రిక్ బస్సుల్లో 50 సింహాపురి (సింహాచలం) డిపోకు, మరో 50 బస్సులు గాజువాక డిపోకు కేటాయించనున్నట్టు చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల వల్ల అక్రమ రవాణాకు అడ్డుకట్టపడుతుందన్నారు.

# ఒత్తిడి ని జయించే సాధనం యోగా

## కాకిరేణిపల్లెలో యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు (**టుడే విదుర**) : ప్రతిరోజు యోగాను ఆచరించడం వలన ఆరోగ్య పరిరక్షణతోపాటు ఒత్తిడిని జయించే సాధనంలా పనిచేస్తుందని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. గురువారం చౌదూరు సచివాలయ పరిధిలోని కాకిరేణిపల్లె గ్రామంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్‌వో గౌతమి, ఏఎన్‌ఎంలు గోవిందమ్మ, వేదవతి, ఆశా కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, పద్మావతి, సంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ అధికారి మోహన్, పండితులు తెలిపారు. జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాసనాలు ప్రతి వాడ, ప్రతి ఇంటికి స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు చేయాలని సూచించారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో తామంతా మరికొందరు భక్తులతో ప్రతి రోజు ఉదయం యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రారంభించామన్నారు. ఆలయాల సమీపంలో ఉన్న భక్తులు, అధికారులు యోగాసనాలు చేసుకుని ఆరోగ్యంగా ఉ



ండాలని కోరారు.

పోరుమామిళ్లలో : యోగాపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ల ఆ కళాశాలలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీకళశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ మర్రి శ్రీనివాసు లు హాజరై యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ రామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పుల్లీడు గ్రామంలో కూడా అధికారు లు యోగా కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

# పొగాకు రైతులను కోవాలి

## పొగాకును కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడికి విజ్ఞప్తి చేస్తున్న ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు

## మంత్రి అచ్చెన్నకు ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి



ఎర్రగొండపాలెం(**టుడే విదుర**): నియోజకవర్గంలో రైతులు పండించిన పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడిని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కలసి వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంబోత్సవానికి వచ్చిన మంత్రి అచ్చెన్నను ఎరిక్షన్‌బాబు స్థానిక నాయకులతో కలిశారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 2024.-2025 సంవత్సరాలలో ఎక్కువ మంది రైతులు పొగాకును సాగు చేశారని, రైతుల ఇళ్లల్లో పొగాకు బేళ్లు నిల్వ ఉన్నాయన్నారు. రైతుల నుంచి పొగాకును కొనుగోలు చేసేలా కృషి చేయాలని మంత్రికి ఎరిక్షన్‌బాబు కోరారు. ఆయనవెంట టీడీపీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, గద్దె మల్లయ్య, పుల్లలచెరువు మండల రైతులు ఉన్నారు.

# ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

## జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలపై రోగులను విచారిస్తున్న ఎమ్మెల్యే వరద

## జిల్లా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు , (**టుడే విదుర**): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల ను ఇంకా బాగా మెరుగు పరుచుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వైద్య అధికా రులకు సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుప త్రిని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీతోపాటు అన్ని వార్డు లలో పేషంట్లకు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రోగు లకు అందించే ఆహారం నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుప త్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు కానీ సిబ్బందికానీ మర్యాదపూర్వకంగా పలుకరించాలన వారిని అగౌరవ పరిచేరీతిలో వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. రోగుల వద్ద సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఇది మానుకోకుంటే ఉద్యోగాలు ఊడుతాయని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎమ్మె ల్యే వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేలు శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

# గృహాలు సరే.. రోడ్లు నిర్మించరా..?

పోరుమామిళ్ల,(**టుడే విదుర**): ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికా రులు గృహ నిర్మాణాలు వేగవంతం చేస్తున్నా రోడ్డు మాత్రం నిర్మించక పోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ హ యాంలో మంజూరైన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నిధుల కొరత నత్తనడకన సాగిన విషయం విదితమే. దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఎన్టీఆర్ కాలనీ పేరుతో గృహ నిర్మాణాలను వేగవం తం చేయడంతో మంజూరైన గృహాలు దాదాపు 90 శాతం పూర్తి చేసుకునే స్థాయికివచ్చాయి. అలాగే ఎస్సీ ఎస్టీ బీసీలకు రూ.50వేలు అదనంగా కేటాయించడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు. పోరు మామిళ్ల, రంగసముద్రం మినహా మిగిలిన పంచాయతీల్లో దాదాపు 90 శాతం గృహాలు పూర్తయ్యాయి. కాకపోతే రహదారుల నిర్మాణం చేపడితే తమకు పూర్తిస్థాయిలో సౌకర్యం కలుగుతుందని

## రహదారులు లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం



లబ్ధిదారులు చెబుతు న్నారు పోరుమామిళ్ల మండలంలో 1339 పక్కాగృహాలు మంజూరు కాగా రెండు ఎనఎస్‌లో ఉండగా మరో 115 బీబీఎల్ దశలో ఉండిపోయాయి. 24 లెంటల్ లెవల్‌లో, 160 రూఫ్‌లెవల్‌లో, 20 శ్లాబు లెవెల్‌లో ఉన్నాయి. 907 గృహాలు పూర్తయ్యాయి. లబ్ధిదారులు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలకు సంబంధించి ఎక్కువ గృహాలు మంజూరయ్యాయి. కాలనీల్లో రోడ్లు, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయలు లేక చీకట్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. కాలనీలకు ఏర్పాటు చేసిన పైపులైనును ఇతరులు కూడా దిగువన ఉన్న వారు పైపులైను తీసుకోడం వల్ల ఇబ్బంది ఉందని చెబుతున్నారు.

# అందని తల్లికి వందనం



తహసీల్దార్ కార్యాలయం వద్ద భూ సర్టిఫికెట్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

కణేకల్లు, (**టుడే విదుర**): రీ సర్వేలో సమస్యల వల్ల తల్లికి వందనం పథకం అందక అనేక మంది మహిళలు తహసీల్దార్, సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈ పథకం లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ఆయా సచివాలయాల్లో ఏర్పాటు చేసింది. అనేక మందికి అధిక స్థలాలు ఉన్నాయని, దీంతో వారిని అనర్హులకు ఆ జాబితాలో చూపించారు. క్షేత్రస్థాయిలో వారికి భూమి తక్కువగా ఉన్నా.. రికార్డుల్లో మాత్రం 10 ఎకరాల పైబడి ఉన్నట్లు నమోదయ్యాయి. దీంతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించారు. ప్రధానంగా గతంలో రీ సర్వేలు చేసిన గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి అధికంగా ఉంది. గ్రామాల్లో భూమి సర్వే చేసినపుడు కొన్ని భూములకు సమస్యలు ఉండటంతో వాటిని పెండింగ్‌లో ఉంచారు. అలాంటి వారికి భూము లు అధిక విస్తీర్ణంలో ఉన్నట్లు నమోదయ్యాయి. దీంతో అనేక మంది తల్లికి వందనం పథకానికి అన్ని అర్హతలు ఉన్నా.. వారికి తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదు. దీంతో రెవెన్యూ అధికారుల ద్వారా తమకు క్షేత్రస్థాయిలో ఎంతమేర భూమి ఉందో వాస్తవ సర్టిఫికెట్లు తీసుకొని.. వాటిని సచివాలయాల్లో అందించాల్సి ఉంది. ఈ వాస్తవ సర్టిఫికెట్ల కోసం అనేక మంది బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నారు.

# ఎన్టీఆర్ బేబీ కిట్లు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు
ప్రజాప్రభుత్వం నిర్ణయం
తల్లీ, బిడ్డలకు ఆరోగ్య వసరుల కల్పనపై దృష్టి
గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాన్ని
పునరుద్ధరించిన సీఎం చంద్రబాబు

**(టుడే విదుర):** ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేయాలి.. పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి.. ఆసుపత్రుల్లో చేరే వారికి మెరుగైన వసతులు కల్పించాలి.. ఈ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలపై దృష్టిపెట్టగా.. తాజాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమర్థంగా అమలైన ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాలను పునరుద్ధరించింది. ప్రసవాలకు వచ్చే పేద తల్లుల నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించేలా చర్యలు చేపట్టింది. 2014–19లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ విధానం అమలు చేయడంతో రాష్ట్రంలో లక్షలాది మంది పేద తల్లులు, నవజాత శిశువులు సురక్షితంగా ఇళ్లకెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పథకాన్ని తొలగించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులు, పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు త్వరలోనే ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించనుంది. వీటిని త్వరితగతిన ఆసుపత్రులకు అందించేలా అవసరమైన చర్యలను చేపట్టింది. దీంతో మహిళల్లో ఆనందంతోపాటు బిడ్డలకు ఈ పథకం రక్షణ కవచం కానుంది.

**కిట్‌లో 11 రకాల వస్తువులు**

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఎన్టీఆర్ బేబీ కిట్‌లో11 రకాల వస్తువులు ఉంచనున్నారు. దీని ఖరీదు సుమారు రూ.1410గా ఉంటుంది. పురిటి బిడ్డలు సుఖంగా నిద్రించేందుకు బెడ్, దోమతెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే శానిటైజర్, బేబీ సబ్బు, న్యాప్‌కిన్, పౌడర్, రెండు టవల్స్, చిన్న బొమ్మవంటి వస్తువులు ఉంటాయి. వీటిని బయట కొనుగోలు చేయాలంటే సుమారు రూ. 1000 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. కాగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే పేదవారికి ఎన్టీఆర్ బేబీ కిట్లు ఆరోగ్యకరమైన వనరులుగా మారనున్నాయి.

**జిల్లాలో నెలకు 1500 ప్రసవాలు**

జిల్లాలో ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఒకటి ఉండగా, మార్కాపురంలో జిల్లా వైద్యశాల ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్లు 89, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 9 వరకు ఉన్నాయి. వాటితోపాటు ఏరియా ఆసుపత్రులు మరో 9 వరకు ఉన్నాయి. వీటిల్లో నెలకు సుమారు 1500 వరకు ప్రసవాలు జరుగుతుండగా, వారిలో అత్యధిక శాతం మంది నిరుపేదలే. బిడ్డపుట్టగానే పరిశుభ్ర వస్త్రాల్లో ఉంచి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపడంతో శిశుమరణాలు కూడా నమోదైన సందర్భాలు ఉన్నాయి. కాగా ప్రజా ప్రభుత్వం శిశు మరణాలు తగ్గించడంతోపాటు, తల్లుల ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. దీంతోఎన్టీఆర్ బేబీ కిట్లు అందజేసి, తల్లి, బిడ్డ సంరక్షణ ధ్యేయంగా దృష్టి సారించింది.

# బదిలీ తేదీపై స్పష్టత ఇవ్వాలి : యుటిఎఫ్

## డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



అనంతపురం **(టుడే విదుర):** తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉదయం అనంతపురం విద్యాశాఖాధికారి ఎం.ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. 2025 లో జరిగిన బదిలీలలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు 8/06/25న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం తెలుగు, హిందీకి సంబంధించిన ఉపాధ్యాయులు 08/06/2025 రిలీవ్ అయ్యి, 09/06/2025 నూతన పాఠశాలల్లో జాయిన్ కావాలని చెప్పారన్నారు. పాఠశాల సహాయకులు తెలుగు, హిందీకి సంబంధించి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రిలీవ్ కాకూడదని 08/06/2025న సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ ఉత్తర్వులు అనుసరించి భాష పాఠశాల సహాయకులు ఆరోజు బదిలీ పొందిన పాఠశాలలో చేరకుండా పూర్వపు పాఠశాలలోనే డిప్యూటేషన్ కింద హాజరు అయ్యారన్నారు. 15/06/25న విడుదల చేసిన ఉత్తర్వుల్లో 14వ తేదీ రిలీవింగ్ 15న జాయినింగ్ అని కొంతమంది, 15న రిలీవింగ్ 16న జాయినింగ్ అని కొంతమంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుల్లో సందిగ్ధత ఉందన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ ఉపాధ్యాయులకు స్పష్టమైన తేదీని జిల్లావ్యాప్తంగా ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బదిలీ పొందిన వారికి క్యాడర్ స్ట్రెంగ్త్ ఇష్యూ సకాలంలో జీతాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ వీటిపై రెండు రోజుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, నారాయణ స్వామి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవంలో పాల్గొనండి

## పిటిసిలో యోగా డే నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం **(టుడే విదుర):** అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ డా.ఎం.వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 21వ తేదీ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు గంట సేపు జిల్లా స్థాయి యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో దాదాపు 5వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 23 లక్షల మంది జనాభా ఉండగా, యోగాంధ్రలో భాగంగా ఇంటింటికి సర్వే చేసి 9,97,518 మంది పౌరులను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. యోగాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆయా కేంద్రాల్లో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది యోగాలో పాల్గొని ప్రపంచ రికార్డు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఎఈబి.దేవి, ఆయుష్ అధికారి డా.ఎరామ్ కుమార్, పాల్గొన్నారు.

21న అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ డా.ఎం.వి.వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆర్డీవో కేశవులు నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈబి.దేవి, డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలన చేశారు. యోగా కోసం పిటిసికి వచ్చే వారు యోగాసనాలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

# ప్రేమ పేరుతో పిలిచి..

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం
## దుండగులతో దాడి చేయించిన ప్రేమికుడు
## ఒంగోలులో ఘటన

ఒంగోలు **(టుడే విదుర)** : పరిచయం ఉన్న యువతి ప్రేమగా మాట్లాడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రమ్మని పిలిచి తన ప్రియుడుతో కలిసి హత్య చేసేందుకు యత్నించారు. ఈ సంఘటన ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళి తే... ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన ఓ యువతి, యలమంద అనే యువకుడు ఐదు నెలల క్రితం ఉద్యోగం కోసం హై దరాబాద్ వెళ్ళారు. అక్కడ ఒంగోలు నగరం శ్రీ రామ్‌కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బూసి వెంకటేష్ వారికి పరిచయం అయ్యాడు. ఈక్ర మంలో సదరు యువతికి వెంకటేష్‌తో ప్రే మగా మాట్లాడుతూ సన్నిహితులయ్యారు. ఇ లా నాలుగు నెలలు తరువాత ఆ యువతి, యలమంద కలిసి హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామం వచ్చారు. అయితే వారి ఇరువురు ప్రేమించుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉ న్న వెంకటేష్‌తో తన ప్రియురాలు మాట్లాడు తుందని గుర్తించిన యలమంద ఆమెతో గొడ వపడ్డాడు. ఈక్రమంలో ఇరువురు కలిసి ఓ ప థకం రూపొందించారు. తన ప్రియురాలితో స న్నిహితంగా ఉంటున్న వెంకటేష్‌ను అడ్డ తొల గించాలని యలమంద తన మిత్రులతో కలిసి మాట్లాడుకున్నాడు. ఈనేపథ్యంలో తన ప్రియు రాలితో వెంకటేష్‌కు ఫోన్ చేయించాడు. మనం కలవాలంటూ వెంకటేష్‌ను ఒంగోలుకు పిలి పించారు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్నా నంటూ ఆమెతో ఫోన్ చేయించాడు యల మంద. దీంతో అక్కడకు కారులో వెంకటేష్ రాగానే యలమంద, మరో నలుగురు యువకు లు పూటుగా మద్యం తాగి అతడిని చితకబాది హత్యాయత్నం చేశారు. అదే సమయంలో గ స్తీలో ఉన్న పోలీసులు గుర్తించి అక్కడకు వెళ్లే సరికి దుండగులు పరారీ అయ్యారు. చావుబ తుకుల మధ్య ఉన్న వెంకటేష్‌ను వెంటనే రి మ్స్‌కు తరలించారు. దుండగులలో ఒకరిని పో లీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# గిరిజనుల్లోనే అధికంగా సెకిల్‌సెల్ ఎనీమియా



పల్నాడు జిల్లా **(టుడే విదుర):** అరుదైన, జన్యుపరమైన వ్యాధి సికిల్ సెల్ ఎనీమియాను రూపుమాపేందుకు కృషి చేద్దామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. దీనిపై నరసరావుపేట మండలం పెద్దతురకపాలెం గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరవగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కొద్ది మందికో వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వస్తుందని, బాధితులను వెంటనే గుర్తిస్తే వారిని కాపాడొచ్చని చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా వంశపారపర్యంగా రక్తంలో ఆక్సిజన్ తక్కువై తెల్ల రక్త కణాల శాతం పడి పోతుందన్నారు. ఈ వ్యాధిపై గిరిజనుల్లో ఎక్కువ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉందని, మేనరికాలు, ఒకే రక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు. రక్త హీనత, సరిపడ ఆక్సిజన్ అందకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జోత్స్న, ఆర్‌డిఓ కె.మధులత, తహశీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 100కి తగ్గకుండా అడ్మిషన్లు జరగాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మాట్లాడుతూ నెమ్మదిగా నేర్చుకునే పిల్లలపై, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠాలను ఓపిగ్గా బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈ నెల నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తుండటంపై అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డిఈఓ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

# యోగాంధ్ర ఎఫెక్ట్

♦ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా
♦ బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు
♦ బస్సులు విశాఖ తరలింపు
♦ ప్రయాణికుల అవస్థలు



**(టుడే విదుర):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రజలను శనివారం విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగాంధ్రకు ప్రజలను తరలించేందుకు టెక్కలి ఆర్‌టిసి డిపోలో బస్సులను తీసుకెళ్లారు. పర్యవసానం వివిధ ప్రాంతాలకు సర్వీసులు నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణం చేయాలనుకున్న ప్రయాణికులు నానా అవస్థలకు గురయ్యారు. యోగాంధ్రాకు కోసం పాడేరు, ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులను విశాఖ తరలించే క్రమంలో 18 బస్సులను తరలించారు. అదేవిధంగా జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల నుంచి ప్రజలను తరలించేందుకు ఇదే డిపో నుంచి శుక్రవారం మరో 23 బస్సులు బయలుదేరనున్నాయి. టెక్కలి ఆర్‌టిసి డిపోలో 55 బస్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో 40 బస్సులు వరకు తరలిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు గురు, శుక్ర, శనివారాలు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. పూండి, పాతపట్నం వైపు వెళ్లే సర్వీసులను రద్దు చేశారు. శుక్రవారం మరిన్ని సర్వీసులను రద్దు చేయనున్నారు. అయితే ప్రయాణికులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మికంగా సర్వీసులను రద్దు చేసి బస్సులను తరలించడంతో ప్రయాణం కోసం కాంప్లెక్స్‌కు చేరుకునే వారు గమ్యం చేరుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కాగా, ఆర్‌టిసి సర్వీసులు అర్ధాంతరంగా రద్దు కావడంతో గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురైంది. దీంతో ప్రయివేట్ వాహనదారులు ఇదే అదనుగా అదనపు రుసుంలు వసూళ్లు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా విద్యా సంవత్సరం ఆరంభంలో ఉండడం, బదిలీలు జరిగిన నేపథ్యంలో ఉద్యోగులు ఆయా ప్రాంతాలకు చేరుకునేందుకు కాంప్లెక్స్‌కు వెళ్లారు. బస్సులు లేవని తెలియడంతో అకింత అసహనానికి లోనయ్యారు.

# ధర లేక దిగాలు

♦ ఆయిల్ పామ్ తోట
♦ కేంద్రం దిగుమతి సుంకం తగ్గించడమే కారణం
♦ ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతులు.. ఆదుకోవాలని విన్నపం



కురుపాం,**(టుడే విదుర):** ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటకు గిట్టుబాటు ధర లేక తలలు పట్టుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించింది. ఈ కారణంగా ఆయిల్ పామ్ గెలల ధర పతనమైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కేంద్ర సర్కారు చర్యలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో ఏడు వేల హెక్టార్లలో సుమారు నాలుగు వేల మంది ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నాలుగు వేల ఎకరాల్లో పాత తోటలు ఉండగా, మరో 3 వేల ఎకరాల్లో పంట రానున్న ఆరు నెలలు, ఏడాదిలో చేతికి రానుంది. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. కాగా సాగు ఖర్చుల కంటే తక్కువ ధర రావడంతో గతంలో చాలామంది రైతులు తోటలను తొలగించారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. అయితే ఇటీవల కాలంలో ధర ఆశాజనకంగా ఉండడంతో మళ్లీ ఆయిల్‌పామ్ సాగుపై మొగ్గు చూపారు. కాగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో గెలల ధర తగ్గింది. గత నెలలో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ20,290 వరకు ఉండేది. దిగుమతి సుంకం తగ్గించిన తర్వాత రూ.18,600 కు ధర పడిపోయింది. రానున్న రోజుల్లో టన్నుకు మరో రూ.3 వేలు తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దిగుమతి సుంకాన్ని 50 శాతం పెంచి రైతులను ఆదుకోవాలి. అధిక దిగుబడి ఇచ్చే సీడ్‌ను పంపిణీ చేయాలి. మొక్కల సబ్సిడీ బకాయిలు నిధులను వెంటనే విడుదల చేయాలి. గ్రేడింగ్ పేరుతో కర్మాగారాలు గెలలను కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపో తున్నారు. పార్వతీపురంలో పామాయిల్ కర్మాగారం ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# ఉన్న ఊరు, జ్ఞాపకాలను వదిలి

☛ ఊహ తెలిసినప్పట్నుంచీ ఆ ఊర్లోనే
☛ సామగ్రితో పునరావాసానికి వెళ్తున్న గ్రామస్తులు
☛ మూలపేట నిర్వాసితుల తరలింపు ప్రక్రియ ప్రారంభం
☛ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాత్కాలిక షెడ్లు నిర్మాణం



**(టుడే విదుర):** ఊహ తెలిసినప్పట్నుంచీ ఆ ఊర్లోనే ఉన్నారు ఊరుతో, ఆ వాతావరణంతో, చక్కని పొలాలు, కొబ్బరి తోటలతో ఉన్న అనుబంధం ఇకపై తెగిపోనుంది. కొత్త ప్రాంతం, కొత్త ఊరిలో ఇకపై తమ జీవితం కొనసాగించేందుకు వారంతా సన్నద్ధమవుతున్నారు. మూలపేట పోర్టు నిర్మాణంతో నిర్వాసిత గ్రామమైన విష్ణుచక్రం ఇప్పుడు పునరావాస కాలనీకి తరలించే ప్రక్రియ మొదలైంది. తాజాగా సంతబొమ్మాళి మండలం విష్ణుచక్రం లో నిర్వాసితులకు గృహాలు తొలగించి నౌపడ దరి ప్రభుత్వం 55 ఎకరాల్లో నిర్మిస్తున్న నిర్వాసిత కాలనీకి వారిని శరవేగంగా తరలించే ఏర్పాట్లు అధికారులు చేపట్టారు. గ్రామంలో 60 ఇళ్లు, 558 ప్రజలు ఉన్నారు. తొలుత ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఒక్కో కుటుంబానికి 5 సెంట్లు స్థలం చొప్పున లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. వారికి కేటాయించిన ఐదు సెంట్ల స్థలంలోనే ఒక పక్కన తాత్కాలిక రేకు షెడ్లను ప్రభుత్వం నిర్మించింది. అవసరమైన విద్యుత్ లైన్లు, డ్రెయినేజీ, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ నెల 15న పరిహారం చెల్లింపులకు ఇళ్లు, ఆస్తులు విలువ కట్టారు. ఇద్దరికి మినహా 58 పిడిఎఫ్ ఫ్యామిలీలకు రూ.5.45 కోట్లు పాత ఇళ్లకు పరిహారం చెల్లించారు. ఈ మేరకు వారి ఇళ్లలోని సామగ్రిని బరువెక్కిన హృదయాలతో పునరావాస కాలనీకి నిర్వాసితులు తరలివెళ్లారు. దీంతో తహశీల్దార్ హేమసుందర్, రెవెన్యూ అధికారులు గ్రామాన్ని కాళీ చేయిస్తున్నారు. యంత్రాల సహాయంతో ఇళ్లను తొలగిస్తున్నారు. దీంతో ఉన్న ఊరిని చూసిన నిర్వాసితులు భావోద్వేగానికి గురై ఊరితో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పునరావాస కాలనీకి తరలిపోతున్నారు.

# భర్త ఆచూకీ కనబడలేదని భార్య, పిల్లలు కన్నీటి రోదన



వెదురుకుప్పం (పాలసముద్రం):**(టుడే విదుర):** పాలసముద్రం మండలం నరసింహపురం పంచాయతీ గ్రామానికి చెందిన పాండురంగన్ భార్య విజయనిర్మల తమ భర్తను కార్వేటి నగరం ఎక్సైజ్ శాఖ పోలీసులు అర్ధరాత్రి ఇంట్లో ఉన్న తమ భర్తను పాండురంగన్ బలవంతంగా తీసుకెళ్లారు. అర్ధరాత్రి నుంచి భార్య తమ పిల్లలు ముగ్గురు ఆడపిల్లలతో కలిసి భర్త ఆచూకీ కోసం ఎక్కడికెళ్లినా సమాచారం లేక అల్లాడిపోతున్నామని కన్నీటితో ఆవేదన వ్యక్తం చేశారు. తమ భర్త సారావృత్తిని వదిలి ఏడు నెలలు అవుతున్న పోలీసుల వేధింపు నిలపలేదని అన్నారు. తమ భర్త ఆచూకీ తమకు తెలపాలని మీడియా ద్వారా విన్నవిస్తున్నట్లు కోరారు.

# కార్మిక వ్యతిరేక మార్పులను తిప్పికొట్టండి



వంగర **(టుడే విదుర):** కార్మిక వ్యతిరేక మార్పులను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సి హెచ్.రూపావతి అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం నిర్వహించారు. విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు వై.అప్పలస్వామి మాట్లాడుతూ విఆర్‌ఎలకు, స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీను ఈ రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. దీనిపై భవిష్యత్తులో అన్ని సంఘాలు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం మాదిరిగా మరలా కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందన్నారు. రోజుకు పని గంటలు 8 నుండి 10కు పెంచడం, ఓటి దాదాపు రెట్టింపునకు పెంచడం నష్టదాయక మన్నారు. వీటిని కార్మికవర్గం ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టాలన్నారు. ఈ సవరణల వల్ల రాష్ట్రంలోని ఫ్యాక్టరీలు, షాపులు సంస్థల్లో పనిచేసే 50లక్షల మంది కార్మికులు పెద్దఎత్తున నష్టపోతారన్నారు. ఈ ప్రతిపాదన చట్టం కాకుండా కార్మికవర్గం అడ్డుకోవాలన్నారు. 8గంటల పనిని 10.30గంటలలో విస్తరించవచ్చన్న నియమాన్ని ఇపుడు 12 గంటలకు పెంచారన్నారు. వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కేరళ మినహా కేంద్రంలో, రాష్ట్రంలోనూ మిగతా రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేకమైన సవరణలు చేయడం ఇటీవల కాలంలో కనిపిస్తోందన్నారు. కర్నాటకలో అంతకు ముందు ఉన్న బీజేపీ ప్రభుత్వం వారపు పని గంటలు 48 ఉంచి, రోజు పని గంటలను అవసరాన్ని బట్టి పెంచుకోవడమో లేదా తగ్గించడమో చేయవచ్చని చట్టాన్ని మార్చిందన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేయకుండా అలాగే ఉంచిందన్నారు. రాష్ట్రంలో కూడా వైసిపి, టిడిపి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక సవరణలను చేయడమో లేక వాటికి మద్దతునివ్వడమో చేస్తున్నాయన్నారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటానికి జూలై 9 జరిగే సమ్మెకు కార్మికవర్గం సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాధ్, యూనియన్ నాయకులు భారతి, సుశీల, గొడబ అప్పలస్వామి, పి.పైడితల్లి, కే.ఉదరు కుమార్, డి.వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి

**(టుడే విదుర):** కళ్యాణదుర్గం టౌన్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని టిడిపి నాయకులు కొనియా డారు. ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్ రాజ శేఖర్, సీనాయర్ నాయకుడు మల్లికార్జున ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫాదర్ ఫెర్రర్ ఆర్‌డిటి సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలను ఆదుకున్నారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, రైతులకు సబ్సిడీ పరికరాలు, పండ్ల తోటల పెంపకం, తదితర ఎన్నో ప్రజాపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టా రన్నారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి, శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.



# సినిమాకు ప్రత్యేకాకర్షణగా



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మెగా 157'- (వర్కింగ్ టైటిల్). నయనతార కథానాయిక. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలె ప్రారంభమైన మసూరి షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార కలయికలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా, ఈ షెడ్యూల్ ముగిసిందని, ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేకాకర్షణగా ఉండనున్నాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి

## టుడే వినోదం



# థగ్‌లైఫ్‌కు భద్రత కల్పిస్తాం



కమల్‌హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' సినిమాకు భద్రత కల్పిస్తామని కర్ణాటక ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. సినిమా విడుదలపై ఎటువంటి నిర్బంధం విధించలేదని అందులో పేర్కొంది. కర్ణాటక వ్యాప్తంగా సినిమా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారని, అవసరమైతే ప్రేక్షకులకు భద్రత కల్పిస్తామని తెలిపింది. కన్నడ భాషపట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి నటుడు కమల్‌హాసన్‌ను లేఖ రాసిన విషయాన్ని అఫిడవిట్‌లో ప్రస్తావించింది. కాగా, కన్నడ సంఘాల నేతలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. సినిమా విడుదలను అడ్డుకోవద్దని ఆదేశించింది. ఈ విషయమై కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు ప్రవీణ్ శెట్టి మీడియాతో మాట్లాడుతూ. థగ్‌లైఫ్ సినిమా విడుదలకు తమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేయలేదని అన్నారు. కానీ తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపామని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను కన్నడ సంఘాలతో పాటు అందరూ పాటించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించవద్దని, కర్ణాటక శాంతికి కేంద్రమనే విషయాన్ని మరువరాదని ఆయన అన్నారు



# నాగార్జున, ధనుష్.. కుబేరా ఎలా ఉందంటే!

# '8 వసంతాలు' ఎలా ఉందంటే

మను', 'మధురం' చిత్రాల తర్వాత దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి తెరకెక్కించిన ప్రేమకథా చిత్రం '8 వసంతాలు'. అనంతిక సనీల్‌కుమార్ , రవి దుగ్గిరాల, హనురెడ్డి, కన్నా పసునూరి కీలక పాత్రధారులు. చిన్న. పెద్ద అనే తారతమ్యం లేకుండా కంటెంట్ బేస్డ్ సినిమాలకు పట్టం కడుతున్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించిన చిత్రమిది. ఫస్ట్ లుక్ నుంచి ప్రచార చిత్రాలు ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమా వైపు తిప్పుకొన్నాయి. నిర్మాణ సంస్థకు ఉన్న క్రేజ్‌తో సినిమాకు బజ్ పెరిగింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏమేరకు మెప్పించింది? ఫణీంద్ర నర్సెట్టి హిట్ అందుకున్నాడా? రివ్యూలో చూద్దాం. %శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్ కుమార్) స్ట్రాంగ్



లేడీ. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తన అనుభవాల సమాహారంగా పదిహేడేళ్లకే భావోద్వేగభరితను ఓ పుస్తకంగా రాస్తుంది. అది చదివి ఎంతోమంది ఆమెకు అభిమానులుగా మారతారు. ఆమెలో చక్కని రచయిత్రే కాదు.. తల్లి ప్రేమ, బాధ్యత, మార్షల్ ఆర్ట్స్ గురువు అంటే గౌరవం, స్నేహితుల పట్ల కరుణ ఉంచే స్వభావం కలది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ మంచి ప్రావీణ్యం ఉన్న అమ్మాయి శుద్ధి. ఓ రోజు మార్షల్ డోజోలో వరుణ్ (హను రెడ్డి) పరిచయం అవుతాడు. చూసిందే తడవు.. ఆమె ప్రేమకోసం తపిస్తూ వెంటపడతాడు. కొంత సమయంలో తర్వాత ఆమె తనపై ప్రేమను పెంచుకుని చెప్పేలోపు వరుణ్ బర్కిలీలో తన గోల్ సాధించడం కోసం ఆమెను వదిలించుకుని విదేశాలకు వెళ్లిపోతాడు. పగిలిన గుండెతో ఆమె మరో పుస్తకం రాస్తుంది. తదుపరి ఊటీలో తెలుగు రచయిత సంజయ్ (రవి దుగ్గిరాల) పరిచయం అవుతాడు. అతనిని శుద్ధి ప్రేమిస్తుంది. తల్లికి చెబుదామనుకునేలోపు తల్లి ఆరోగ్యం బాగోకపోవడం, ఎస్టేట్స్ చూసుకునే బాధ్యత మీద పడటంతో తన ప్రేమ సంగతి తల్లికి చెప్పలేకపోతుంది. తల్లి ఉన్న పరిస్థితిని బట్టి తన ప్రేమను త్యాగం చేయాలనుకుంటుంది. సంజయ్ ఆమె ప్రేమను గెలిచాడా?



నాగార్జున , ధనుష్ రష్మిక కాంబినేషన్‌లో రూపొందిన సౌత్ ఇండియా మోస్ట్ ఏవైటెడ్ మూవీ కుబేర ఎన్నో అంచనాల మధ్య ప్రపంచవ్యాప్తంగా నేడు (శుక్రవారం 20 జూన్)న ప్రేక్షకుల ఎదుటకు వచ్చింది. ఇప్పటికే విదేశాలలో ఈ చిత్రం ప్రదర్శితం అవగా మరికొన్ని ప్రాంతాల్లో ప్రీమియర్స్ వేశారు. దీంతో సినిమా చూసిన వారంతా ఎలా ఉందో చెబుతూ తమ అనుభవాలను, ఎలా అనిపించిందనే అంశాలను పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేస్తున్నారు. మరి వారి రివ్యూలు ఎలా ఉన్నాయో చూద్దాం %శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఈ సినిమాపై వీక్షకులు తమ అభిప్రాయాలు పంచుకుంటుండగా చాలామంది సినిమాను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఫస్టాఫ్ మైండ్ బ్లోయింగ్‌గా ఉందని, ముఖ్యంగా ధనుష్ ఎంట్రీ తర్వాత మూవీ అదిరిపోయిందని పోస్టులు పెడుతున్నారు.

# ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి

'కుబేర' చిత్ర కథ, ఇందులోని క్యారెక్టర్లు, స్క్రీన్‌ప్లే అన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే సినిమా ఇది' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. ఆయన, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున విలేకరులతో మాట్లాడారు. సినిమా థియేటర్‌లు%మంచి కథ రావాలంటే స్టార్స్ కలసి పనిచేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు చేశాను. నాన్నగారు, ఎన్టీఆర్ గారు, కృష్ణగారు, శోభన్‌బాబుగారు.. ఇలా




అందరూ కలసి ఎన్నో సినిమాలు చేశారు. శేఖర్ కమ్ములతో పనిచేయాలని ఎప్పటినుంచో ఉంది. 'ఆనంద్' దగ్గర నుంచి ఆయన సినిమాలు మనందరికీ తెలుసు. ఆయన సినిమాలంటే నాకు బాగా ఇష్టం. ఆ కథల్లో సామాజిక స్పృహ ఉంటుంది. వాణిజ్య హంగులతో పాటు అద్భుతమైన పాటలూ

ఉంటాయి.

# యోగా డే.. తరలివచ్చిన సినీతారలు



జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన యోగా డే కౌంట్‌డౌన్ శుక్రవారం కలర్‌ఫుల్‌గా మారింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు లతో పాటు పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు,పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు యోగాసనాలు వేశారు. %ఆపై సినీ తారలు తేజ సజ్జా సాయిధరమ్ తేజ్ మీనాక్షి చౌదరి ఖుష్బూ వంటి తారలు సైతం తరలివచ్చి ప్రోగ్రాంకు కొత్త కళ తీసుకు వచ్చారు. తమ ప్రసంగంతో అక్కడికి చ్చిన వారిలో ఉత్తేజం నింపారు. అందరితో పాటుగా యోగా చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రధాని అయిన తర్వాత భారత దేశం ప్రపంచానికి ఇచ్చిన అద్భుతమైన బహుమతి యోగా అని అన్నారు. ఈ యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తించారని.. మోదీ నాయత్వంలో యావత్ ప్రపంచంలో ఉన్న 2 వందల దేశాల నాయకులు, ప్రజలు యోగాను ఆచరిస్తున్నారంటే.. ప్రతి భారతీయుడు గర్వించాల్సిన విషయమని కిషన్ రెడ్డి అన్నారు.

టుడే స్పోర్ట్స్

# జెమీమాను రిటైన్ చేసుకున్న బ్రిస్బేన్



మెల్‌బోర్న్ : మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) 11వ సీజన్‌కు సంబంధించి క్రికెటర్ల ఎంపిక ముగిసింది. భారత్‌నుంచి మొత్తం 15 మంది క్రికెటర్లు బరిలో నిలవగా..కేవలం జెమీమా రోడ్రిగ్స్ మాత్రమే ఎంపికైంది. బ్రిస్బేన్ హీట్ ఆమెను రిటైన్ చేసుకుంది. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు 23 మంది అంతర్జాతీయ క్రీడాకారిణులను ఎంపిక చేసుకున్నాయి.

# గిల్ సేనకు కఠిన సవాల్




లీడ్స్: పాతికేళ్ల కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా తొలిసారిగా సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడబోతోంది. క్రీడాభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐదు టెస్టుల అండర్సన్–టెండూల్కర్ సిరీస్ శుక్రవారం నుంచే ఆరంభం కాబోంది. అలాగే ఇందులో భాగంగా జరిగే తొలి టెస్టుకు హెడింగ్లీ వేదిక కానుంది. అయితే దశాబ్దాలుగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, స్పిన్నర్ అశ్విన్ లేకుండానే భారత జట్టు ఇప్పుడు బరిలోకి దిగాల్సిన పరిస్థితి. అదికూడా అత్యంత కఠిన పరిస్థితులు ఎదురయ్యే ఇంగ్లండ్ గడ్డపై కావడం గమనార్హం. ప్రస్తుతం సంధిదశలో ఉన్న జట్టును కోచ్ గంభీర్ సహకారంతో కెప్టెన్ గిల్ ఎలా ముందుకు తీసుకెళ్లగలడన్న ఆసక్తి నెలకొంది. గత 93 ఏళ్లుగా ఇక్కడ పర్యటిస్తున్నా.. కేవలం మూడు సార్లు (1971, 1986, 2007) మాత్రమే భారత జట్టు సిరీసను సాధించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక హెడింగ్లీలో భారత జట్టు ఏడుసార్లు ఆడితే ఓ మ్యాచ్ డ్రా చేసుకుని కేవలం రెండింట్లోనే నెగ్గింది. ఇంగ్లండ్ పిచ్‌లపై భారత బ్యాటర్లు ఏమేరకు ప్రభావం చూపగలరనే సందేహం నెలకొంది. ఓపెనర్ జైస్వాల్ ఇక్కడ మొదటిసారి ఆడబోతున్నాడు. ఇక అతడికి జతగా రాహుల్ దిగే అవకాశముంది. సాయి సుదర్శన్‌కు అరంగేట్రం చాన్సిస్తే వన్‌డౌన్‌లో రావచ్చు. ఇక కీలక నాలుగో నెంబర్‌లో కెప్టెన్ గిల్ ఖాయమే. ఆ తర్వాత పంత్, కరుణ్ నాయర్ దిగవచ్చు. అయితే ఇంగ్లండ్‌లో గిల్ 3 టెస్టులు ఆడి కేవలం 88 పరుగులే చేశాడు. గత పర్యటనలో రాహుల్, పంత్ శతకాలు సాధించారు. అలాగే బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రాపైనే అధికంగా ఆధారపడింది. సిరాజ్, ప్రసిద్ధ్ ఇతర పేసర్లుగా బరిలోకి దిగనున్నారు. ఒకే స్పిన్నర్‌ను తీసుకుంటే అది జడేజానే అవుతాడు. ఇక ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కుమార్ కంటే శార్దూల్ ఠాకూర్‌కే చాన్సులున్నాయి.

# సీజన్ తొలి టైటిల్‌పై నీరజ్ గురి



పారిస్: ఇటీవలే 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఇప్పుడికసీజన్ తొలి టైటిల్‌పై దృష్టి సారించాడు. ఈక్రమంలో శుక్రవారం జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో విజేతగా నిలవాలని పట్టుదలగా ఉన్నాడు. కానీ జర్మనీ దిగ్గజం జులియన్ వెబర్, రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) నుంచి చోప్రాకు తీవ్ర పోటీ ఎదురు కానుంది. పారిస్ డైమండ్ లీగ్ బరిలో దిగుతున్న ఏడుగురు త్రోయర్లలో ఐదుగురు 90 మీ. మార్క్‌ను చేరుకున్న వారే కావడం గమనార్హం. ఈ లీగ్ 'వాండా డైమండ్ లీగ్' యూ ట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది.

# స్వర్ణాల వేటలో షణ్ముఖి గణేశ్



సింగపూర్: ఆసియా కప్ స్టేజ్–2లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు అదరగొడుతున్నారు. విజయవాడకు చెందిన షణ్ముఖి నాగసాయి బుద్దె మరో రెండు పతకాలు ఖరారు చేసుకోగా.. నాయుడుపేట ఆర్చర్ గణేశ్ మణిరత్నం తిరుమూరు టీమ్ స్వర్ణ పోరుకు చేరుకొంది. మొత్తంగా ఐదు టీమ్ ఈవెంట్లలో భారత జూనియర్ ఆర్చర్లు ఫైనల్స్‌కు చేరుకొన్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీసలో షణ్ముఖి, తేజల్, తనిక్షతో కూడిన భారత జట్టు 230–229తో నాలుగో సీడ్ కజకిస్థాన్‌పై గెలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్‌లో షణ్ముఖి–కుశాల్ జంట 155–154తో ఇండోనేసియా జంట నురిసా డియాన్ అష్రఫ్–ప్రిమా విష్ణు వర్దానపై నెగ్గి ఫైనల్‌కు చేరుకొంది. కాంపౌండ్ పురుషుల టీమ్ సెమీసలో కుశాల్ దలాల్, గణేశ్ తిరుమూరు, మిహిర్ అపార్‌ల త్రయం షూటాఫలో ఆస్ట్రేలియాపై నెగ్గింది. విష్ణు చౌదరి, పరాజ్ హుడా, జుయెల్ సర్కార్‌లతో కూడిన పురుషుల రికర్వ్ టీమ్ 5–1తో బంగ్లాదేశ్‌ను ఓడించింది. స్వర్ణ పోరులో జపాన్‌తో భారత్ తలపడనుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ సెమీసలో వైష్ణవి పవార్–విష్ణు చౌదరి జంట 5–3తో సింగపూర్ జోడీపై గెలిచింది.

# ఆడని వాళ్లు నిధులు వెనక్కివ్వండి




న్యూఢిల్లీ: సహేతుకమైన కారణాలు లేకుండా పలు అంతర్జాతీయ పోటీల్లో దేశం తరఫున ప్రాతినిథ్యం వహించకుండా తప్పుకుంటున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) షాకిచ్చింది. కేంద్ర క్రీడా శాఖ అమలు చేసే వివిధ పథకాల కింద వారికిచ్చిన నిధులను వెనక్కి తీసుకోవాలని జాతీయ టెన్నిస్ సంఘాన్ని సాయ్ ఆదేశించింది. 'తీసుకున్న నిధులకు క్రీడాకారులు జవాబుదారీగా ఉండాలి.. దేశం తరఫున ఆడేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల'ని సాయ్ పేర్కొంది. టాప్స్‌తో పాటు కొత్తగా టీఏజీజీ (టార్గెట్ ఆసియా గేమ్స్ గ్రూప్)ను సాయ్ ఏర్పాటు చేసింది. భారత టెన్నిస్ ప్లేయర్లలో యుకీ భాంబ్రీ, శశికుమార్ ముకుంద్, సుమిత్ నగల్ గత ఏడాది నుంచి పలు అంతర్జాతీయ టోర్నీల నుంచి వైదొలగడం తెలిసిందే.

# బుమ్రా అంటే మాకేమీ భయం లేదు.. బెన్ స్టోక్స్



ఇంటర్నెట్ డెస్క్: భారత స్టార్ పేసర్ బుమ్రా అంటే ఇంగ్లండ్ జట్టుకు భయం లేదని టీం కెప్టెన్ బెన్ స్టోక్స్ స్పష్టం చేశాడు. బుమ్రా ప్రపంచస్థాయి బౌలర్ అయినప్పటికీ ఒంటి చేత్తో జట్టును గెలిపించడం అతడికి సాధ్యం కాదని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ జట్టు సభ్యులు ఇప్పటికే పలు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో తలపడ్డారని, ఏ జట్టు, లేదా ప్లేయర్‌ను చూసినా వారు భయపడరని అన్నాడు.'జంకు లేనే లేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో నిత్యం అద్భుతమైన ప్రత్యర్థులతో తలపడుతుంటాం. బుమ్రా టాలెంట్ గురించి మాకు అవగాహన ఉంది. అయితే, అతడంటే భయం మాత్రం లేదు' అని స్టోక్స్ స్పష్టం చేశాడు. 'ఒకే ఒక బౌలర్ ఈ టోర్నీలో తన జట్టును గట్టెక్కించగలడని నేను అనుకోను. మొత్తం 11 మంది ప్రతిభ కనబర్చాలి. ఒక్క వ్యక్తితో విజయం ముడిపడి ఉన్న పరిస్థితి ఇరు జట్లలోనూ లేదు' అని అన్నాడు. ఇక బెన్ స్టోక్స్‌కు అండగా నిలవాల్సిన సమయం వచ్చిందని మరో ప్లేయర్ జో రూట్ వ్యాఖ్యానించారు. తన కెప్టెన్సీ సమయంలో స్టోక్స్ ఎంతో అండగా నిలిచాడని చెప్పాడు. 2017 నుంచి 2022 మధ్య సారథిగా ఉన్న రూట్‌కు స్టోక్స్ అండగా ఉన్నాడు. ఇక కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాక రూట్ బ్యాటింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచాడు. 36 టెస్టుల్లో 3117 పరుగులు చేశాడు. తన కెరీర్‌లో బాగా ఎంజాయ్ చేసిన దశ ఇదేనని కూడా వ్యాఖ్యానించాడు. నిలకడగా పరుగులు చేస్తూ స్టోక్స్‌కు అండగా నిలవనున్నట్టు చెప్పారు. మంచి ఫామ్‌లో రూట్ జట్టుకు కీలక విజయాలు అందించగలడన్న సెంటిమెంట్ ఇంగ్లండ్ జట్టులో వ్యక్తమవుతోంది. కప్టెన్సీ బాధ్యతలు నిర్వహించాక మళ్లీ సాధారణ సభ్యుడిగా జట్టులోకి రావడం కాస్త వింతగా అనిపించిందని కూడా రూట్ ఇటీవల పేర్కొన్నారు. కానీ, బ్యాటర్‌గా అతడు అద్భుత ప్రతిభ కనబరుస్తూ 56.67 సగటును సాధించాడు.

# నిస్సాంక భారీ శతకం శ్రీలంక 368 4



గాలె: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంక జట్టు దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ పథుమ్ నిస్సాంక (187) భారీ శతకం సాధించగా, మూడో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో లంక 368/4 పరుగులతో నిలిచింది. చాందిమల్ (54)తో కలిసి రెండో వికెట్‌కు నిస్సాంక 157 పరుగులు జోడించాడు. కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఏంజెలో మాథ్యూస్ (39) ఫర్వాలేదనిపించగా.. క్రీజులో కమిందు మెండిస్ (37 బ్యాటిం గ్), ధనంజయ (17 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 495 పరుగులకు ఆలౌటైంది. ఫెర్నాండోకు నాలుగు.. రత్నాయకె, థరిందులకు మూడేసి వికెట్లు దక్కాయి.

# టుడే బిజినెస్

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు



ఇంటర్నెట్ డెస్క్: భౌగోళిక రాజకీయ అస్థిరతలు, వాణిజ్య యుద్ధాల నడుమ బంగారానికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది బంగారం ధరలు ఇప్పటివరకూ 30 శాతం మేర పెరిగాయి. ఇక నిన్నటితో పోలిస్తే నేడు కూడా బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం, శుక్రవారం ఉదయానికి దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర స్వల్పంగా పెరిగి రూ. 1,01,080కు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.92660గా ఉంది. ఇక 18 క్యారెట్‌ల 10 గ్రాముల బంగారం ధర రూ.75820గా ఉంది. కిలో వెండి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.100 మేర పెరిగి రూ.1,12,100కు చేరుకుంది. పది గ్రాముల ప్లాటినం ధర రూ.37,340గా ఉంది.

## గత ఏడాది భారత్‌లో కొత్తగా 39000 మిలియనీర్లు



న్యూఢిల్లీ: ప్రపంచంలో ఆర్థిక వ్యత్యాసాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి. ఇదే సమయంలో డాలర్ మిలియనీర్ల (10 లక్షల డాలర్లు) సంఖ్యా పెరిగి పోతోంది. గత ఏడాది మన దేశంలో కొత్తగా 39,000 మంది ఈ జాబితాలో చేరారు. దీంతో మన దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య 9.17 లక్షలకు చేరింది. అయితే చైనాలో ఉన్న 63 లక్షల మిలియనీర్లతో పోలిస్తే మన దేశంలో ఉన్న మిలియనీర్ల సంఖ్య తక్కువే. 2023తో పోలిస్తే భారత్‌లో మిలియనీర్ల సంఖ్య 4.4 శాతం పెరిగింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ యూబీఎస్ తన తాజా 'గ్లోబల్ వెల్త్' నివేదికలో ఈ విషయం వెల్లడించింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోల్చినా మన దేశంలోనే డాలర్ మిలియనీర్ల సంఖ్య ఎక్కువ.

## అమెజాన్ రూ 2000 కోట్ల పెట్టుబడి




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కార్యకలాపాల విస్తరణ, కస్టమర్ సేవల పెంపుపై ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఈ ఏడాది రూ.2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. కొత్త ప్రాంతాలకు కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఇప్పటికే పని చేస్తున్న ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను మరింత ఆధునీకరించడానికి కూడా ఈ పెట్టుబడులు సహాయకారి అవుతాయి. దీనివల్ల ఆధునిక టెక్నాలజీలు, ఇన్నోవేషన్ సహాయంతో కస్టమర్లకు మరింత విశ్వసనీయంగా, వేగంగా సేవలందించగలుగుతామని పేర్కొంది.

## అబ్బురపరిచేలా NIATతో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రతిభ




హైదరాబాద్, జూన్ 20: ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న ఫస్ట్ ఇయర్ విద్యార్థుల బృందం, జాతీయ స్థాయిలో జరిగిన 'ది మ్యాట్రిక్స్ ప్రోటోకాల్' హ్యాకథాన్ ఫైనల్ రౌండ్ కి ఎంపికైన టాప్-10 టీమ్స్ లో ఒకటిగా నిలిచింది. ఈ 48 గంటల ఫిన్టెక్ ఇన్నోవేషన్ స్ప్రింట్ ను భారతదేశంలోనే అగ్రస్థానంలో ఉన్న పియర్-టు-పియర్ లెండింగ్ ప్లాట్ఫారమ్ లెన్డెన్ఫ్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో జూన్ 13. నుంచి 15 వరకు ముంబయిలో నిర్వహించారు. ఈ పోటీలో భాగంగా పాల్గొన్నవారు, నిత్య ఆదాయం లేని వ్యక్తులకోసం ఏఐ ఆధారిత క్రెడిట్ స్కోరింగ్ మోడల్స్ రూపొందించాల్సిన ఛాలెంజ్ ఎదురుకున్నారు. ఇది ప్రస్తుత ఫిన్టెక్ రంగంలో ఒక పెద్ద సమస్యగా పరిగణించబడుతోంది.ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్కు భారతదేశం నలుమూలల నుంచే కాదు, ఆస్ట్రేలియా, బ్రెజిల్, జర్మనీ, నేపాల్, పెరూ, సౌదీ అరేబియా లాంటి దేశాల నుంచి కలిపి మొత్తం 1,800 మందికి పైగా పాల్గొన్నారు. ఆన్లైన్ రౌండ్ చాలా కఠినంగా ఉండటంతో, చివరికి టాప్ 150 సమస్య పరిష్కర్తలకు ముంబయిలో జరిగే ఆఫ్లైన్ ఫైనల్స్కు ఎంపిక చేశారు. వీరిలో ఐఐటీలు, ఎన్ ఐటీ లు, ఐఐఎంలు, ఐఎస్ ఐ లాంటి అగ్ర విద్యాసంస్థల విద్యార్థులతో పాటు, కాగ్నిజెంట్, మోర్గాన్ స్టాన్లీ. మహీంద్రా, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఈఎక్సెల్, వొడాఫోన్ ఐడియా, ఒరాకిల్, జేపీ మోర్గాన్ చేస్, ఎంఎల్ ఎక్స్పర్ట్స్ ఏఐ, లాంటి దిగ్గజ సంస్థల టెక్నాలజీ నిపుణులు కూడా ఉన్నారు. ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు జాతీయ ఫిన్టెక్ హ్యాకథాన్లో తొలిసారిగా పాల్గొన్నారు.కానీ ఆ మొదటిప్రయత్నమే గొప్ప విజయాన్ని అందించింది. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్, ఫ్రీలాన్సె వలపర్లు, స్టార్టప్ ఫౌండర్ల తో పోటీపడి టాప్-10లో చోటు దక్కించుకున్నారు. ఫ్యాకల్టీ, ఆలుమ్నీ మెంటర్ల మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్థిరమైన ఆదాయం లేని వ్యక్తుల కోసం వారి ఆదాయాన్ని అంచనా వేసే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మోడల్ తయారు చేశారు. ఇది వారికి రీపేమెంట్ క్రెడిట్ స్కోర్ను జెనరేట్ చేస్తుంది. ఈ సిస్టమ్ ఆధారంగా బ్యాంకులు, సంస్థలు త్వరగా నిర్ణయాలు తీసుకోగలుగుతాయి. "జాతీయ హ్యాకథాన్లో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లకు అసలు అవకాశం ఉంటుందా? అనేదే మాకు మొదట్లో సందేహంగా అనిపించింది. కానీ ఫైనల్ డెమో జరిగే సమయానికి ఇండస్ట్రీ మెంటర్లు మా కోడ్ అడగడం మాకు చాలా చూడాలని కాన్ఫిడెన్స్ ఇచ్చింది," అంటున్నారు ఫస్ట్ ఇయర్ విద్యార్థి వేగా దర్శి.నెక్స్ట్ వేవ్ మరియు సీఈఓ కో-ఫౌండర్ రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ 'ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు అనుభవజ్ఞులతో పోటీపడి జాతీయ స్థాయిలో టాప్-10 లో నిలవడం అనేది ట్రైనింగ్, మెంటార్ షిప్ యువతలో అగ్రశ్రేణి నైపుణ్యాలను ఎంత త్వరగా అభివృద్ధి చేయగలదో చూపించే బలమైన ధృవీకరణ,' అని తెలిపారు.భవిష్యత్తును ఎదుర్కొనేందుకు మాత్రమే సన్నద్ధపరచకుండా వారు భవిష్యత్తుకు నాయకత్వం వహించేలా విద్యార్థులను సిద్దం చేస్తుంది . 'ది మ్యాట్రిక్స్ ప్రోటోకాల్ ' లో టాప్-10 లో స్థానం దక్కించుకోవడం అనేది అనేది విద్యార్థుల నేతృత్వంలోని విజయాల పెరుగుతున్న జాబితాలో చేరుకుంది. ఇప్పటికే ఇండస్ట్రీ రెడీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ముంబై టెక్ వీక్లో వారి నైపుణ్యం నిరూపించుకున్నారు. టి-హబ్లో జరిగిన బిజినెస్ హ్యాకథాన్లో విజయంతో పాటు పలు హ్యాకథాన్ లలో విజయం సాధించారు.

## రూ.14,000 కోట్లతో హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ!




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) పెద్దఎత్తున విస్తరించాలని ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) భావిస్తోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్ల కాలంలో దాదాపు రూ.14,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు జీహెచ్‌ఐఏఎల్ ఒక అంతర్గత డాక్యుమెంట్‌లో పేర్కొంది. ఈ విస్తరణలో భాగంగా ప్రస్తుత టెర్మినల్‌ను విస్తరించటంతో పాటు కొత్తగా మరో టెర్మినల్‌ను రన్‌వేను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఈ పనులు ప్రారంభించి 2029 సెప్టెంబరు నాటికి ఈ విస్తరణ పనులు పూర్తి చేయాలని జీహెచ్‌ఐఏఎల్ భావిస్తోంది. ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికులు, గంటకు 42 విమానాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా జీఎంఆర్ గ్రూప్ శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించింది. 2017-18లో 1.83 కోట్లుగా ఉన్న ప్రయాణికుల సంఖ్య ఏటా 7.1 శాతం వృద్ధి రేటుతో గత ఆర్థిక సంవత్సరం 2.95 కోట్లకు చేరింది. రాకపోకలు సాగించే విమానాల సంఖ్యా గంటకు 36కు చేరింది. అంటే ఎయిర్‌పోర్టు త్వరలోనే గరిష్ఠ సామర్థ్యానికి చేరువవుతోంది. దీంతో వెంటనే విమానాశ్రయం సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ప్రస్తుత టెర్మినల్ ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి 4.7 కోట్లకు విస్తరించడంతో పాటు కొత్తగా 2 కోట్ల మంది ప్రయాణికులు, 46 నుంచి 47 విమానాలు రాకపోకలు సాగించేలా ఇంకో టెర్మినల్, 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

అత్యాధునిక సౌకర్యాలు

ఈ విస్తరణ, ఆధునీకరణను అధునాతన సదుపాయాలతో పూర్తి చేయాలని జీహెచ్‌ఐఏఎల్ భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే రన్‌వేలో క్యాటగిరి-1 ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, అధునాతన నావిగేషన్ పరికరాలను ఏర్పాటు చేయనుంది. దీంతో రన్‌వే సరిగా కనిపించక పోయినా పైలెట్లు విమానాలను సురక్షితంగా ల్యాండింగ్ చేయగలుగుతారు.

## హైదరాబాద్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీహెచ్‌ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియల్టీ జాయింట్ వెంచర్ సంస్థ.. జీహెచ్‌ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా.. హైదరాబాద్, కోకాపేట్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్ పేరుతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నియోపోలిసలో 7.34 ఎకరాల విస్తీర్ణంలో 63 ఫ్లోర్లతో కూడిన ఐదు టవర్లు, మొత్తం 1,189.. 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వామి కర్తీశ్ రెడ్డి వెల్లడించారు. రూ.3,169 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు ఎస్‌బీఐ రూ.900 కోట్ల నిధులను సమకూర్చిందని సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్ వెల్లడించారు.

63 ఫ్లోర్లతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు ఓబెన్ ఎలక్ట్రిక్ సిరీస-ఏ ఫండింగ్‌లో భాగంగా మొత్తం రూ.100 కోట్లు సమీకరించింది. ఇందులో భాగంగా జనవరి నెలలో రూ.50 కోట్లు సమీకరించగా మే నెలలో మరో రూ.50 కోట్ల నిధులను సేకరించింది. హీలియోస్ హోల్డింగ్స్, శారద ఫ్యామిలీ ఆఫీస్, కే ఫ్యామిలీ నుంచి ఈ మొత్తాలను సమీకరించింది. తాజా నిధులతో కంపెనీ ఇప్పటి వరకు సమీకరించిన నిధులు రూ.200 కోట్లకు చేరాయి. టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎసడీసీ)తో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.425 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంయుక్తంగా సర్టిఫికెట్ జారీ చేయనున్నాయి. వెల్‌స్పన్ తన టెక్స్‌టైల్ యూనిట్లలో వీరికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006